

రాత్రి తొమ్మిది దాటింది.

అప్పటివరకు కుండపోతగా కురిసిన వర్షం తగ్గుముఖం పట్టింది. వీధి కాలవ లోని మురికినీరు స్వేచ్ఛగా రోడ్లమీద ప్రవహిస్తుంది. అప్పుడప్పుడు ఆకాశం మెరుస్తుంది.

తీరిగ్గా వీధి వరండాలో కూర్చొని, చుట్ట కాలుస్తున్న శివరాం తనను ఎవరో పిలిచినట్లు వినబడగానే, చుట్ట నుసి కొనవేళ్లతో దులిపి, పక్కకు తిరిగి చూశాడు.

ఎవరో మెట్లమీద నిలబడిఉన్నారు. స్పష్టంగా కనిపించడంలేదు. కరెంటు పోవడంవలన వరండాలో బాగా చీకటిగా ఉంది. శివరాం వచ్చిన వ్యక్తి వేపు తీక్షణంగాచూశాడు. కానీ, అతన్ని గుర్తు పట్టలేకపోయాడు. సదేహంగా చూస్తూ ఉండిపోయాడు.

మళ్లీ అతను పిలిచాడు.

"ఎవరూ ?..." ఈసారి శివరాం ప్రశ్నించాడు.

"నమస్కారం సార్...నా పేరు గోపాలం...రామశేషయ్యగారి అబ్బాయిని..." అతను తనను పరిచయం చేసుకున్నాడు. రామశేషయ్య పేరు ఎప్పుడో విన్నట్టుగా తోచినా, అతనెవరో శివరాంకి సరిగా జ్ఞాపకం రాలేదు. గుర్తు రాకపోయినా, ఎరిగున్నట్టుగా సభ్యతగా గోపాలాన్ని పలకరించాడు.

"ఓ...ఓ...నువ్వటమ్మా.. ఎవరో అనుకున్నాను. పోల్చలేకపోయాను ... మీదికిరా...ఇంట్లో అంతాబావున్నారా?" చిన్నవాళ్లనయినా, పెద్దవాళ్లనయినా ఆప్యాయతగా 'అమ్మ' అని పిలవటం అతనికి అలవాటు.

గోపాలం మౌనంగా వచ్చి, శివరాంకి

కొంచెం దూరంలో చేతులు కట్టుకొని నిలుచున్నాడు. శివరాం - వరండాలోకి లాంతరు పట్టుకురమ్మని భార్యను పిలిచాడు.

కామాక్షి వెలిగించిన హరికెన్ లాంతరు తీసుకువచ్చి, బల్లమీద పెట్టి, వత్తి పెద్దది చేసింది. వరండా అంతా వెలుగు పరుచుకుంది.

స్తబ్ధుగా నిల్చున్న గోపాలంవేపు పరిశీలనగా చూశాడు, శివరాం. రెండు పదులు దాటకపోయినా, జీవితంలో ఊగిసలాడి విసిగిపోయిన గోపాలం సన్నగా నిలబెట్టిన వెదురు బద్దలా ఉన్నాడు. వర్షానికి తడిసిన బట్టలు శరీరానికి అతుక్కుపోవడం వలన ముందున్న ఎముకల ఎత్తుపల్లాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి గాజు గోళీల్లాంటి కళ్ళు అతను అనుభవిస్తున్న నికృష్ట జీవితాన్ని దారుణంగా చూపిస్తున్నాయి. ఎప్పుడో చేసుకున్న పాపం, దరిద్రంగామారి అతన్ని పిప్పిచేస్తుందని అనుకోవచ్చును. నిస్తేజంగా ఉన్న అతని ముఖంమీద యింకా నీరు కారుతుంది. ఆ ముఖంలో భయమూ అందోళన చోటుచేసుకున్నాయి.

గోపాలం ముఖంలో పోలికలు చూసిన తర్వాత-రామశేషయ్యతో ఉన్న చిన్న పరిచయం శివరాంకి గుర్తు వచ్చింది. పరిచయం ఎలా కలిగిందో గుర్తు లేకపోయినా, మనిషి 'ఫలానా' అని తెలిసింది.

"మీ నాన్నగారు ?..." శివరాం అర్థోక్తిలో 'ఆగిపోయాడు. ఏ ప్రశ్న వేయాలో అతను ముందుగా ఆలోచించ లేదు.

అయిదేళ్ల క్రిందట గోపాలం తండ్రి చెప్పా చెయ్యకుండా హఠాత్తుగా కళ్ళు మూశాడు. మూసిన కళ్ళు మళ్లీ తెరవ లేదు. తన ఋణం తీర్చుకోలేకపోయినా ఉన్నవాళ్ల ఋణం తీర్చుకోమన్నట్లు పెద్ద సంసారాన్ని, పుట్టెడు అప్పుల్నీ గోపాలం చేతిలో పెట్టి, కన్నీళ్లు పంచి పెట్టి 'జీవితంలో నాపాత్ర అయిపోయిం' దంటూ చక్కగా వెళ్ళిపోయాడు.

"మా నాన్నగారు లేరండి...ఆయన చనిపోయారు." గోపాలం బరువుగా సమాధానం యిచ్చాడు.

"అయ్యో పాపం!...ఏ మనిషికి ఎప్పుడు చావురానుందో మనకు తెలియదమ్మా...ఇంటికి పెద్దవాడివి నువ్వే కామోసు. మరి బరువు బాధ్యతలు మోయక తప్పదు" చాల అనునయంగా మాట్లాడాడు, శివరాం.

కొన్ని క్షణాలు మౌనంగా దొర్లిపోయాయి

"ఏంవమ్మా! ... ఉద్యోగం ఏదైనా చేస్తున్నావా ?"

శివరాం అలా అడిగేసరికి, గోపాలంకి కొండంత ధైర్యం వచ్చింది. తన మనసు

లోని విషయాన్ని బయటపెట్టటానికి అవకాశం కలిగింది.

"సార్ నాన్నగారు పోయినప్పట్నించి ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాను. నా ప్రయత్నాలు ప్రయత్నాలుగానే మిగిలిపోయాయి. ఉద్యోగం దొరకలేదు...ఇంతకాలం అమ్మా చెల్లెలూ చాకిరీలు చేసి, ఇల్లు గడుపుతుంటే, దౌర్భాగ్యుడిలా చూస్తూ ఊరుకోవడం తప్ప నేనేమీ చేయలేక పోతున్నాను.

"సార్...నాకు ఒకే ఒక అదృష్టం కలిగింది. ఓ ఫ్యాక్టరీలో మెకానికల్ డిపార్టుమెంటులో సెలక్టయ్యాను. మెడికల్ టెస్ట్‌కి రమ్మని పిలిచారు...నేను మెడికల్లో నెగ్గితే, నాకు ఉద్యోగం అవుతుంది...సార్! అంతా మీ చేతుల్లో ఉంది. మీరు డాక్టరుగారితో చెబితే, నాకు తప్పకుండా ఉద్యోగం దొరుకుతుంది. మీరు సహాయం చేసి, మమ్మల్ని కాపాడాలి, సార్.." గోపాలం తనఇంటి పరిస్థితులతోబాటు వచ్చిన పనికూడ వివరించాడు. పెద్దవాడిగా తన బాధ్యత నిర్వర్తించాలనీ, ఇంట్లోవాళ్లని సుఖపెట్టాలనీ మరేమో చేయాలనుకుంటున్నాడు. కటిక చీకటిలాంటి తన జీవితంలో ఓ కాంతిరేఖ మెరిసింది. అది చేజారిపోతుందనే అనుమానం అతన్ని పీడిస్తుంది.

శివరాం మాట్లాడలేదు. అతని భ్రుకుటి ముడిపడింది. సాధారణంగా ఏ ఉద్యోగానికైనా ఎవర్నయినా ఎన్నుకొని తీసుకుంటే, వాళ్లనుఫ్యాక్టరీలో ఉన్న డిస్పెన్సరీ డాక్టరుదగ్గరికి పంపిస్తారు. డాక్టరు మెడికల్‌గా సిఫారసు చేస్తే తప్ప ఎవర్నీ ఉద్యోగంలోకి తీసుకోరు. గోపాలానికీ అస్థిపంజరానికీ అట్టేతేడా ఉండదు. ఎముకలగూడుమీద పలుచని చర్మం అంటించి, మీద బట్టలు కప్పినట్టు ఉంటాడు అతను. అతన్ని ఏ మెడికల్ ఆఫీసరయినా సిఫారసు చేయడని ఖచ్చితంగా చెప్పవచ్చును.

"సార్ !...మీరు కాదనరనే నమ్మకంతో మీ దగ్గరికి వచ్చాను...మీ మాట డాక్టరుగారు కాదనరు...నాకు ఉద్యోగం లేకపోతే, మా ఇంట్లో అంతా పస్తులతో మాడి చస్తాం సార్...మా అమ్మ ముసల్దయిపోయింది. ఆమెను కష్టపడమని నేను అసమర్థుడిలా కూర్చోలేను. నన్ను నమ్ముకున్నవాళ్లకి కన్నీళ్లు చూపించి నిరాశలు పెంచలేను...సార్! మీ మేలు ఎప్పటికీ మరిచిపోను...మీ డాక్టరు గారితో చెప్పి ఈ ఒక్క అదృష్టానికి దూరంకాకుండా చేయండి...ఆయనతో చెప్పి నాకు ఉద్యోగం వచ్చేలా చూడండి...ప్లీజ్." గోపాలం ప్రాధేయపడ్డాడు. ఆ మాటల్లో దైన్యభావం నిండిఉంది. కళ్ళలో నీరు నిలిచింది.

శివరాం యిబ్బందిలో పడ్డాడు.

శివరాం పదిహేనేళ్లుగా కాంపౌండరు

ఉద్యోగం చేస్తున్నాడు. పాత డాక్టరు గారు తన మాటను ఎప్పుడూ కాదన లేదు. గోపాలంలాంటి కొందరికి ఉపకారం చేయగలిగాడు. కానీ, పాత డాక్టరు రిటైరయిపోయాడు. కొత్త డాక్టరు వచ్చాడు. అవసరం ఉంటేగాని అతను కాంపౌండర్నిగాని మరెవర్నిగానిపిలవడు. ఎప్పుడూ ముభావంగా ఉంటాడు. కొత్త డాక్టరుతో చనువుగా ఉండాలని తను ప్రయత్నించేడు. ప్రయత్నిస్తు న్నాడుకూడ. కానీ, అతను అవకాశమే ఇవ్వటంలేదు. ఇప్పుడు తను గోపాలంకోసం ప్రయత్నించినా డాక్టరు గారు తన మాటకి విలువయిస్తారని నమ్మకం కుదరలేదు.

వెంటనే గోపాలంకి మాటిచ్చి ధైర్యం చెప్పలేకపోయాడు శివరాం.

"చూడమ్మా !...నీకు సహాయం చేయటానికి నాకేం అభ్యంతరం లేదు. నీలాంటివాళ్లకి ఉపకారం చేయాలనే ఉంటుంది నాకు...కానీ, మా కుర్ర డాక్టరుగారితో పేచీ ఏఁషిటో మనకింకా తెలీదమ్మా...అంటే అతనేదో లంచాలు పుచ్చుకుంటాడని కాదు. రూల్సుకోసం తల బద్దలుకొట్టుకుంటాడు...ఈ కుర్ర డాక్టర్లకి జీవితం గురించి పూర్తిగా తెలీదు. కష్టం, సుఖం అని ఆలోచించ రమ్మా...అయినా నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. తరువాత నీ అదృష్టం."

"సార్ !...మీ ప్రయత్నం వృధా కాదు. కొత్త డాక్టరుగారైనా మీరు అడి గితే మాటిస్తారు...నాకు ఉద్యోగం అవుతుంది. సార్...మీరు తప్ప మరెవరూ మమ్మల్ని ఆదుకోలేరు."

"సరే...ఇంతకూ నీకు మెడికల్ ఇంటర్వ్యూ ఎప్పుడు ?"

"శనివారం సార్..."

"శనివారమా ?...ఆ రోజు డిస్పెన్స రీకి రాగానే మొదట నన్ను కలుసుకో... నీ పేరు గోపాలంకదూ ? డాక్టరుగారితో మాట్లాడతాను.. ఈ ఉపకారం చేస్తే అతనికి వచ్చే నష్టం ఏమీ ఉండదమ్మా. ఎటొచ్చీ కాసేపు అతను 'రూల్సు' పక్కకి పెట్టి, రికమెండ్ చేస్తే నీకు ఉద్యోగం అయిపోతుంది."

"ఏవండీ...ఆ అబ్బాయికి ఈ చిన్న సహాయం చేస్తే మీ డాక్టరుగారికి పుణ్యం వస్తుందని చెప్పండి...వాళ్ల కష్టాలు వింటే, అతనికి జాలికలగకపోదు!..." కామాక్షి మాట్లాడకుండా ఉండలేక పోయింది. గోపాలంమీద జాలీ, సానుభూతి.

"అంతా గోపాలం అదృష్టం... గోపాలం ! నువ్వెళ్లమ్మా...మళ్లీ వర్షం వచ్చేలా ఉంది." చేతిలో ఉన్న చుట్ట పీకను వీధిలోకి విసిరి, లేచి నిలుచున్నాడు, శివరాం.

గోపాలం కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు. ఆ క్షణంలో తనను అంటి పెట్టుకున్న దరిద్రానికి ఫేర్వెల్

యివ్వగల ధీమా, జీవితంలో ఓ కొత్త అధ్యాయం ఆరంభం అవుతుందనే నమ్మకమూ అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

శివరాం చాలసేపు ఆలోచిస్తూ నిద్రపోలేదు. అతని ఆలోచనల్లో గోపాలం, కొత్త డాక్టరు నిండిపోయారు. గోపాలానికి ఉద్యోగం దొరకాలి. కొత్త డాక్టర్ని సహాయం కోరాలి. తను సాధించాలి. మనసులో మెదిలిన ఆలోచనలకి ఓ రూపం దిద్దుకొని, ఆచరించబోయే కార్యక్రమాన్ని మననంచేసుకొన్నాడు.

సాధించగలననే నమ్మకంతో శ్వాస తీసుకుని శివరాం నిద్రకుపక్రమించాడు.

* * *

అయిదువేలమంది పనిచేస్తున్న పెద్ద ఫ్యాక్టరీ. ఆకాశంలాంటి సింహద్వారం. లోపల అన్నివైపుల వివిధ రకాల డిపార్టుమెంట్లు. మెయిన్ గేటుకి నాలుగు ఫర్లాంగుల దూరంలో ఓ చిన్న కొండ. దానిమీద ఫ్యాక్టరీ డిస్పెన్సరీ. అద్దాలగోడల ఆసుపత్రి చుట్టూ అందాల లాను.

డిస్పెన్సరీ లోపలికి అడుగుపెట్టడానికి గోపాలం అడుగులు తడబడ్డాయి. ఏవో సంశయాలతో మనసంతా గజిబిజిగా ఉంది. అవ్యక్తమైన ఆందోళన చోటుచేసుకుంది.

"చూడమ్మా, గోపాలం!..నా శాయశక్తులా ప్రయత్నించాను. డాక్టరుగారితో అన్నీ చెప్పాను. అతను 'అలాగే' అని మాటిచ్చారు...కానీ, పని అయ్యేవరకు మనం నమ్మకూడదు. పెద్దవాళ్లు కదూ? యిచ్చిన మాటను మరిచిపోవచ్చు కూడ.నీ పరిస్థితులు అతనితో మరోసారి చెప్పటం చాల మంచిది. ఆ రూల్సు మనిషిని జాలితో కరిగించి, మన పనులు చక్కబెట్టుకోవడం తప్ప మరో మార్గం లేదు."

శివరాం ఎవరి విషయంలోనూ అంత శ్రమ తీసుకోలేదనే చెప్పాలి. ముందు రోజున —డాక్టర్ గారితో అవకాశం కల్పించుకొని, తన సొంత కొడుక్కి ఉద్యోగం యిమ్మన్నట్లుగా ప్రాధేయపడ్డాడు. డాక్టరుగారు ఆ చిన్న సహాయం చేస్తే, అతని జీవితాంతం ఋణపడి ఉంటానని బ్రతిమాలుకున్నాడు. గోపాలం ఇంటి పరిస్థితులు చెప్పి, అతనికి ఆసరా కల్పించి, అతని కుటుంబాన్ని కాపాడమని అభ్యర్థించాడు. డాక్టరుగారు అవునని తల ఊపినా ఏదో అనుమానం శివరాంలో మిగిలిపోయింది.

"సార్...మీకు ఎలా కృతజ్ఞత చెప్పుకోవాలో తెలియటంలేదు..మీరు చాల శ్రమతీసుకుంటున్నారు." గోపాలం—శివరాం రెండుచేతులు పట్టుకున్నాడు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న తననూ తనవాళ్ళనూ ఒడ్డుకిచేర్చే మహానుభావుడిలా శివరాం కన్పించాడా సమయంలో.

"శ్రమాలేదూ పాడూలేదూ...నీకు

ఉద్యోగం దొరికి, మీ ఇంట్లోవాళ్ళంతా హాయిగా ఉంటే నాకెంతో తృప్తిగా ఉంటుందమ్మా...ఆ తృప్తి నాకు చాలు ...గోపాలం! టైం అవుతుంది లోపలికి నడమ్మా." శివరాం లోపలికి దారితీశాడు

వయసు మళ్ళిన తల్లి, వయసొచ్చిన చెల్లెళ్లూ, వయసురాని తమ్ముళ్లూ -తనను చుట్టుకున్న బంధాలన్నీ తనవేపు జాలిగా చూస్తున్నాయి. ఆ చూపుల్లో ఎన్నో ఆశలు కనిపిస్తున్నాయి. వాళ్ళ కన్నీళ్లు తుడిచి, ఆశలు వెలిగించాలని-నెమ్మదిగా శివరాం వెనుక నడిచాడు, గోపాలం.

చెదరిపోయిన హృదయాన్ని చిక్క బట్టుకుంటూ, అసమర్థతను అణచు కుంటూ డాక్టరుగారి ముందుకి గోపాలం వెళ్ళాడు.

డాక్టరు తన విధిని ప్రారంభిం చాడు.

గోపాలం గట్టిగా కళ్ళు మూసు కున్నాడు.

అంతా చీకటిగా ఉంది. విచిత్రమైన నిశ్శబ్దం మనసుని భయపెడుతుంది. వింత వింత రంగులు, ఊహించటానికి వీలుకాని పిచ్చిగీతలు, నిర్దుష్టంగాలేని ఏవో ఆకారాలు వివిధ భంగిమల్లో-క్షణాల్లో మారిపోతున్నాయి. ఎక్కడికో లాక్కుపోతున్నాయి. కిందికి తోస్తు న్నాయి. మీదికి నెట్టుతున్నాయి. మళ్ళీ చీకటి చోటుచేసుకుంటుంది. ఆ చీకటిని చూడలేక గోపాలం బాధతో మెలికలు తిరిగిపోయాడు.

డాక్టరు పరీక్ష పూర్తిచేశాడు.

"ఎప్పట్నుంచి మీ కీ క్షయవ్యాధి."

గోపాలం ఉలిక్కిపడ్డాడు. డాక్టరు వేపు దీనంగా చూశాడు. ఆ చూపులో కోటి వేదనలు, అనంతకోటి అశ్రువులు నిలిచాయి. అబద్ధం చెప్పటానికి వీలుకాని నగ్నసత్యం. తన కీజబ్బు ఎప్పట్నుం చని చెప్పగలడు? కంటికి నిద్రా, మనసుకి శాంతీ లేనప్పట్నుంచని చెప్పాలి.

గోపాలం డాక్టరువేపు ఎక్కువసేపు చూడలేకపోయాడు. సమాధానంకూడ యివ్వలేకపోయాడు.

"నేను డాక్టర్ని... భయపడకండి. నాదగ్గర దాపరికం దేనికి?"

అవును డాక్టరుదగ్గర దాస్తే తన జబ్బు దాగుతుందా? దాగదు. తను అబద్ధం చెప్పకూడదు.

గోపాలం పెదవులు వణుకుతున్నాయి.

"డాక్టరుగారూ?...నేను అయిదేళ్ళ నుంచి ఉద్యోగంకోసం తిరుగుతున్నాను. నేను ఉద్యోగం సంపాదించలేక పోయాను. కానీ...కానీ, ఈ జబ్బును సంపాదించగలిగాను, డాక్టరుగారూ!.."

డాక్టరు మాట్లాడలేదు.

"సార్!...శివరాంగారు మా ఇంటి పరిస్థితులన్నీ మీతో చెప్పే ఉంటారు... మా కుటుంబంలో నేనే పెద్దవాణ్ణి,

డాక్టరుగారూ!...మా నాన్నగారు పోయి చాల రోజులయింది. నేను ఉద్యోగం చేస్తే తప్ప మా ఇల్లు గడవదు సార్!...ఉద్యోగంకోసం రాత్రీ పగలూ కష్ట పడి తిరిగాను. నా చదువు కొన్ని ఉద్యోగాలకి పనికిరాలేదు...కొన్ని ఉద్యోగాలకి నేను పనికిరాలేదు. ఈ అయిదేళ్ళలో నా ఆరోగ్యం పోయింది, సార్...ఉద్యోగం దొరకలేదు...దయచేసి, మా బతుకులు ఎలాంటివో ఒక్క క్షణం ఆలోచించండి. నాకు ఆరోగ్యం ముఖ్యం కాదు. ఉద్యోగం ముఖ్యం డాక్టరుగారూ!... మీరు కనికరించాలి!..." గోపాలం కళ్లలో నీరు సుడులు తిరిగింది.

"సార్! ... చిన్నవాళ్ళని మీరు చూడాలి!...మీరు ఆదుకోవాలి సార్. వాళ్ళ ఇంటి కష్టాలు నోటితో చెప్పేవి కావు. స్వయంగా చూడవలసినవి, సార్ .. వాళ్ళకి బతుకు తెరువును చూపించాలి, సార్..." శివరాం చాల నెమ్మదిగా, సాఫీగా మాట్లాడేడు.

డాక్టరు 'రూల్సు మనిషి' కావచ్చును. కానీ, ఆ రూల్సు వెనుక అతనూ అందరిలాంటి మామూలు మనిషే. అతనికీ— కరుణా, జాలీ, ప్రేమా, పేదరికం బాధ్యతా, బరువూ, అన్నీ తెలుసు. లేమిలో మనిషి అనుభవించే కష్టాలు ఎలాంటివో అతను అర్థంచేసుకోగలడు.

అందుకే గోపాలం కళ్ళలో నీటిబిందువులు చూసి, కాదనలేకపోయాడు.

మళ్ళీ మళ్ళీ తన బరువు బాధ్యతల్ని డాక్టరుగారితో చెప్పుకున్నాడు గోపాలం.

డాక్టరుగారు-గోపాలంచేతికి మెడికల్ ఫారమ్స్ యిస్తూ- "నేనొక మెడికల్ ఆఫీసరుగా పనిచేస్తూ, ఈ ఉద్యోగానికి మిమ్మల్ని పంపటానికి విచారిస్తున్నాను...ఈ కాగితాలు డిపార్టుమెంటు ఫోర్మన్‌కి యిచ్చి డ్యూటీలో చేరండి.

"ఆరోగ్యం ముఖ్యం అని మరిచిపోకండి...డబ్బుంటే మీ జబ్బు తగ్గిపోతుంది. ప్రయివేటు డాక్టర్ని కలుసుకొని మంచి మందులు వాడండి. అశ్రద్ధచేస్తే, భవిష్యత్తు ఉండదు." సలహాయిచ్చాడు.

డాక్టరు చాల గంభీరమైన వ్యక్తి. పాతికేళ్లయినా నిండని అతనిలో ఎన్నో అనుభవాలు పండిపోయాయి. అతని ముఖంలో మంచితనం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. దేవుడిలాంటి ఆ మనిషికి గోపాలం రెండుచేతులు పైకెత్తాడు కృతజ్ఞతగా.

"థాంక్యూ ... థాంక్యూ వెరీమచ్ సార్...నాకు పునర్జన్మ నిచ్చారు .. మా జీవితాలకి వెలుగుని ప్రసాదించారు."

"చూడమ్మా, గోపాలం!...డాక్టరుగారు చాల మంచివారు. నీకోసం రిస్క్-తీసుకొని, నిన్ను మెడికల్‌గా రికమెండ్ చేశారు...పెదవి దాటితే పృథివి దాటుతుందంటారు...ఎందుకయినా మంచిదమ్మా, డాక్టరుగారు నీ కిమేలు చేశారని ఎవరితో చెప్పకు... డైరెక్టరుగారికి తెలిస్తే ప్రమాదం." డిస్పెన్సరీ యివతల గోపాలం భుజం మీద చెయ్యివేసి హెచ్చరించాడు, శివరాం.

"సార్... డాక్టరుగారికీ, మీకూ కృతజ్ఞతలు తప్ప మరేమీ యివ్వలేను... సమాధి అయిపోతున్న మా జీవితాలకి మళ్ళీ జీవం పోశారు. జన్మ జన్మలకి మీ మేలు గుర్తుంచుకుంటాను, సార్..." గోపాలం సంతోషానికి హద్దుల్లేకపోయాయి.

* * * *

గోపాలం కొత్తజీవితంలో పది రోజులు పదిపుటలుగా తిరిగిపోయాయి. ఒడిదుడుకులు లేకుండా జీవితం బాగానే సాగిపోతుందని ఎన్నో ఆలోచనలు చేశాడు. ఏవేవో ఊహించుకొని, అందమైన పేకమేడలు అల్లుకున్నాడు. అల్లుకున్న అందమైన పేకమేడల్ని చూస్తూ, భవిష్యత్తు గురించి ఆలోచనలు చేస్తున్న గోపాలాన్ని మళ్ళీ మెడికల్ టెస్టుకి పిలిచారు.

అతని జీవితంలో ఓ తమాషా జరిగిపోయింది. ఎత్తయిన శిఖరంమీద నిల్చున్న అతను -క్షణంలో కాలుజారి అగాధాల్లోపడిపోయాడు. అతనిఆరోగ్యం ఉద్యోగానికి సరిపడదని, యిచ్చిన ఉద్యోగం లాక్కొని, యింటికి పొమ్మన్నారు.

ఆ సాయంత్రం శివరాం ఇంటికి

వెళ్ళాడు, గోపాలం. జరిగినదంతా చెప్పి, భోరున ఏడ్చాడు. జీవితంలో తిరస్కృతియను తట్టుకోలేకపోయాడు.

శివరాం సానుభూతి చూపించలేదు. గోపాలం మాటలువిని-'అయ్యో పాపం' అనలేదు. మండిపడి, అతనిమీదవిరుచుకు పడ్డాడు.

"చాల్లేమ్మా!...నీ బతుక్కి అర్థం చూపించాలని డాక్టరుగారు ఉపకారం చేశారు. ఆ మాట ఎవరితో అనొద్దని చిలక్కి చెప్పినట్టు చెప్పాను నేను... కానీ, ఏ౦వయిందీ? ... ఉద్యోగం అయిందని అందరితో గొప్పలుచెప్పావు. చెప్పినందుకు తగిన శాస్తి జరిగింది... నీ ఉద్యోగం పోతేపోయింది, బంగారం లాంటి మా డాక్టరుగారి ఉద్యోగంకూడ పోయింది ... పుణ్యానికిపోతే, పాపం ఎదురవుతుందంటారు...ఇదేకామోసు!"

గోపాలం విస్తుపోయాడు.

"సార్...డాక్టరుగారి ఉద్యోగం పోయిందా?...నన్ను నమ్మండి, సార్... నేనెవరితో చెప్పలేదు." గోపాలం గొంతు పూడుకుపోయింది. నమ్మలేని నిజం ఏదో అతన్ని హేళనచేస్తుంది.

"నిన్ను నమ్మనమ్మా—నమ్మబట్టే, శ్రమ తీసుకొని, డాక్టరుగారితో చెప్పాను. ఆతను నమ్మిన సిద్ధాంతాల్ని నీకోసం పక్కకు నెట్టి - నువ్వు చెప్పిన కథలు విని, ముందు జరగబోయే ప్రమాదాన్ని ఆలోచించకుండా నిన్ను ఆదుకున్నాడు ...ఆదుకున్నందుకు అతనికి అపకారం జరిగిపోయింది. . . నువ్వు చెప్పిన ఆ గొప్పలువిన్న ఎవడో మెయిన్ ఆఫీసులో ఊదుంటాడు. బుద్ధి గడ్డితిని, నీకు హెల్ప్ చేయడమే ఓ పెద్ద తప్పు...వెళ్ళమ్మా వెళ్ళు..." ఇంచు మించుగా శివరాం కసిరాడు.

గోపాలం ఏదో చెప్పబోయాడు.

శివరాం - అతన్ని ఏమీ చెప్పనివ్వ లేదు.

"సార్!...లోకంలో ఉన్న దరిద్రం అంతా నా చుట్టూ తిరుగుతుంది. మీరు చేసిన మేలు—నా దరిద్రాన్ని చూసి బెదిరిపోయింది. ఈ దౌర్భాగ్యుడిమీద జాలిచూపినందుకు డాక్టరుగారి ఉద్యోగం పోయింది ... క్షమించండి, సార్! ... మేము దరిద్రులం. మమ్మల్నెవరూ రక్షించలేరు. మమల్ని మేమే రక్షించు కోవాలి!...సెలవ్." గోపాలం బరువుగా కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు.

* * *

ఒక క్షయరోగికి ఉద్యోగం సిఫారసు చేసి, ఫ్యాక్టరీ నిబంధనలు ఉల్లంఘించినందుకు డాక్టరుకు నోటీసు ఇచ్చి, తక్షణం ఉద్యోగంనుండి తొలగించారు పెద్ద ఆఫీసువాళ్లు. వెయిటింగు లిస్టులో ఉన్న డా॥ నీలకంఠాన్ని తీసుకొని డిస్పెన్సరీలో ఖాళీని పూర్తిచేశారు. ఆ ఉద్యోగంకోసం నీలకంఠం ఎన్నాళ్లుగానో కలలు కంటున్నాడు.

"డియర్ శివరాం!...మెనీ మెనీ థాంక్స్. మన ఒప్పందం ప్రకారం ఈ డబ్బు యిస్తున్నాను. తీసుకో ....."
పదిహేను వంద నోట్లు డా॥ నీలకంఠం కాంపౌండరు శివరాంకి అందించాడు.

ఇంపోర్టెడ్ విస్కీని సిప్‌చేస్తున్న ఆఫ్టరాల్ వందరూపాయల ఉద్యోగి-శివరాం తన కొత్త బాస్‌చేతిలోని పచ్చ కాగితాలు అందుకున్నాడు.

శివరాం జీవితంలో అది ఖరీదైన రోజు. అతను అన్ని పచ్చకాగితాల్ని కలిపి చూడటం కూడ అదే మొదటిసారి. తృప్తిగా నీలకంఠంవేపు చూశాడు.

డా॥ నీలకంఠం బాటిల్లో ఎర్రటి ద్రవాన్ని మంచుగడ్డల గ్లాసులోకి పోసుకుంటున్నాడు. వెలుగుతున్న సిగరెట్టును పెదవుల మధ్య తమాషాగా ఆడిస్తున్నాడు. అతని ఎర్రటి కళ్ళలో 'తను అనుకున్నది సాధించిన తృప్తి' ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

"బాస్!...ఇది నా జీవితంలో మరపురాని రోజు." శివరాం హృదయాంతరాల్లో సంతోష తరంగాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి'

"యస్ మై ఫ్రెండ్...ఐ యాం నౌ రియల్లీ సేటిస్ఫయిడ్... అనుకున్నది సాధించి, ఫ్యాక్టరీలో ఖరీదైన ఉద్యోగం సంపాయించగలిగాను." డా॥నీలకంఠం గర్వంగా అన్నాడు. గట్టిగా నవ్వేడు.

ఒకరి కొకరు చేతులు కలుపుకొని, గట్టిగా కరచాలనం చేసుకున్నారు.

శివరాం-తన క్రింది ఉద్యోగి అనే భావన డా॥ నీలకంఠం చూపుల్లో లేదు. బాస్‌తో సమానంగా కూర్చున్న భయం శివరాంలో లేదు ఇద్దరూ ఎదురెదురుగా కూర్చుని, సాధించినదాన్ని తలచుకుంటూ తృప్తిగా త్రాగుతున్నారు. పిచ్చిగా నవ్వుకుంటున్నారు

డా॥ నీలకంఠంకి బారులో తిరుగుతున్న మనుషులెవరూ మనుషుల్లా కనిపించటంలేదు. అక్వేరియమ్‌లో చేప పిల్లల్లా కనీ కనిపించకుండా కనిపిస్తున్నారు.

నిత్యం నరకాన్ని అనుభవిస్తూ—తనవాళ్ళకోసం, తన ఊపిరిపోయినా ఫరవాలేదని ఉద్యోగంకోసం పిచ్చివాడిలా తిరుగుతున్న అస్థిపంజరంలాంటి గోపాలంగాని; జీవితంలో ఎప్పుడూ అక్రమంగా ప్రవర్తించకపోయినా. ఓ నిర్భాగ్యుని బతుకుకోసం, ఒక్కసారి నమ్మిన సిద్ధాంతాలకి కట్టుబడకుండా అమాయకుడిలా ప్రవర్తించిన రూల్సు మనిషి డాక్టరు గాని - శివరాంకి కనిపించటంలేదు. అతని కళ్ళముందు పచ్చనోట్లు విలాసంగా తిరుగుతున్నాయి.